క్లుప్తంగా

నీటిని వృథా చేయొద్దు..



చేపల చెరువు వేలంలో పాల్గొన్న స్థానికులు

మధిర: చేపలు పట్టే సమయంలో చెరువు నీటిని వృథా చేయకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మద్దాల ప్రభాకర్ డిమాండ్‌చేశారు. మండల పరిధిలోని తొండలగోపవరం గ్రామపంచాయతీ శివారు తొర్లపాడు గ్రామంలోని చేపల చెరువును పంచాయతీ కార్యాలయంలో బుధవారం వేలం నిర్వహించారు. చెరువులోని చేపలను పట్టేందుకు చెరువులోని నీటిని బయటకు వెళ్లదీయటం వలన రైతులకు త్రీవ నష్టం జరుగుతుందన్నారు. రైతులకు నష్టం కల్గించే విధంగా ఉన్న చెరువులను చేపల పెంపకానికి వేలం నిర్వహించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు వూట్ల శంకర్‌రావు, కాశిబోయిన శ్రీనివాసరావు, చేబ్రోలు బాబురావు, కొండయ్య, మాధవరావు, మచ్చా అప్పారావు, కృష్ణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే అజెండా

కారేపల్లి: ప్రజా సమస్యల పరిష్కారమే.. ఎర్రజెండాల అజెండా అని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. బుధవారం కారేపల్లి క్రాస్‌రోడ్డులో సీపీఎం సీనియర్ నాయకుడు దైద బిక్షమారెడ్డి సంస్మరణ సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. బిక్షమారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. అమరజీవి బిక్షమారెడ్డి తాను నమ్మిన సిద్ధాంతాని తన తుదిశ్వాస వరకు విడవలేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు భూక్యా వీరభద్రం, జిల్లా కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, సత్యనారాయణ, నాయకులు మంగయ్య, ఇంద్రారెడ్డి, సైదులు, సురభి కొండలు పాల్గొన్నారు.

ఘనంగా ఇంటర్నేషనల్ చెస్ డే వేడుకలు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని నారాయణ పాఠశాలలో బుధవారం ఇంటర్నేషనల్ చెస్ డే సందర్భంగా విద్యార్థులకు చెస్ పోటీలు నిర్వహించారు. జూనియర్ విభాగంలో 3, 4, 5వ తరగతి విద్యార్థులు పాల్గొనగా విజేతలకు గురువారం బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. ఏజీఎం వేణుగోపాలరావు, వినోద, లక్ష్మి, ప్రేరణ, సతీష్, పీఈటీ మురళీ పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

వైరారూరల్: విద్యార్థినులు తమ ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎస్.నాగేంద్రమ్మ అన్నారు. మండలంలోని ముసలిమడుగు ఎస్టీ గురుకులంలో 10 రోజుల పాటు నిర్వహించిన ఛాయిస్ ఫర్ దిశ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో వాయిస్ ఫర్ దిశ కోఆర్డినేటర్ శరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

23న మెగా జాబ్‌మేళా

సత్తుపల్లి: ఈ నెల 23న గంగారం సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజ్యసభ సభ్యుడు, హెటిరో అధినేత బండి పార్థసారధిరెడ్డి సత్తుపల్లి నియోజకవర్గంలోని నిరుద్యోగులకు హెటిరో సంస్థలో ఉపాధి కల్పించేందుకు ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మోటార్ సైకిల్ చోరీ

తల్లాడ: మండలలోని కుర్నవల్లి గ్రామంలో మోటార్ సైకిల్ చోరీకి గురైంది. కుర్నవల్లికి చెందిన జంపాల వెంకట రమణ తన వాహనాన్ని పొలం పక్కన పార్కింగ్ చేయగా, ఈనెల 17వ తేదీ రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఘటనపై ఆయన చేసిన ఫిర్యాదుతో బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి

తల్లాడ: మండలంలోని కేశ్వాపురం గ్రామంలో బుధవారం విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమరం లక్ష్మణ్‌రావుకు చెందిన గేదె ఉదయం పొలాల్లోకి మేతకు వెళ్లింది. గుర్రం నాగేశ్వరరావు పొలంలో విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతూ ఉండగా మేతకు వచ్చిన గేదె వాటిని తాకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. పాడి గెదె విలువ రూ.75 వేలు ఉంటుందనీ రైతు తెలిపాడు. ఈ మేరకు ఎస్సై సురేష్ పంచనామా నిర్వహించారు.

మీ ఆరోగ్యం జాగ్రత్త..

- అప్రమత్తంగా ఉంటేనే.. సీజనల్ వ్యాధులు దూరం
- అపరిశుభ్రంగా సైడ్ డ్రెయిన్లు
- రహదారులపై నిలిచిన వర్షపు నీరు



మురుగునీటితో నిండిన సైడు డ్రెయినేజీ



మత్కేపల్లిలో రహదారిపై ఇళ్ల మధ్య నిలిచిన వర్షపు నీరు

ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో 'సీజనల్ వ్యాధుల'తో పాటు విషజ్వరాలు ప్రబలే అవకాశాలు ఉన్నాయి. ప్రజలు అవగాహనతో పాటుగా అప్రమత్తంగా ఉంటే సీజనల్ వ్యాధులు, విషజ్వరాల నుంచి రక్షణ పొందవచ్చు.

చింతకాని: వర్షాలకు విజృంభిస్తున్న దోమలు ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కాల్వల్లో పేరుకున్న మురుగు, నిల్వనీరు దోమలకు ఆవాసంగా మారతాయి. దోమల కారణంగా మలేరియా, చికెన్ గున్యా, డెంగీ వంటి విషజ్వరాలు వ్యాపిస్తాయి. ఇపట్టికే పలు చోట్ల డెంగీ కేసులు నమోదయ్యాయి. అంతే కాకుండా మన పరిసర ప్రాంతాల్లో ఉన్నటువంటి పాతబడిన కూలర్లు, టైర్లు, రోళ్లు, తాగిపడేసిన కొబ్బరి బొండాలు తదితర వాటిల్లోని నిల్వ నీటిలో దోమలు వృద్ధి చెందే అవకాశం ఉంది. కావున పరిసర ప్రాంతాల్లో నిలవ్వనీటిని ఉండకుండా, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధుల నుంచి తప్పించుకోవచ్చు.

అవగాహన అవసరం..

వర్షాకాలంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో పారిశుద్ధ్యం, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి. ప్రతి ఏటా మండలంలోని పలు గ్రామాల్లోని ప్రజలు ఇప్పటికే విషజ్వరాల బారినపడుతున్నారు. దీంతో వారి వైద్యానికి లక్షలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుంది. కావున అధికారులు ప్రతీ వర్షాకాల సీజన్ ప్రారంభంలో సమీక్ష సమావేశాలు నిర్వహించి పారిశుధ్య పనులపై అవగాహన కల్పిస్తే కొంతమేరకైనా రక్షించవచ్చు.

అపరిశుభ్రంగా సైడ్‌డ్రెయిన్లు..

ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లోని సైడ్ కాలువల్లో చెత్త, మట్టి పేరుకుపోయి అపరిశుభ్రంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో అధికారులు మాత్రం హడావుడి చేయడమే తప్ప పారిశుధ్య నివారణకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే పంచాయతీ కార్మికుల సమ్మె చేస్తున్న కారణంగా గ్రామాల్లో చెత్త, మట్టి, మురుగు నీటితో సైడు కాలువలు వర్షపు నీటితో నిలిచి రహదారులు అధ్వాన్నంగా ఉన్నాయి. కావున పూర్తిస్థాయిలో అధికారులు పారిశుధ్య పనులు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- సైడ్ కాలువల్లో చెత్తను తీసివేయించి మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలి.
- కాలువల వెంబడి బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించాలి.
- దోమల నివారణ మందు పిచికారీ చేయించాలి. తాగునీరు కలుషితం కాకుండా చూసుకుంటూ రక్షిత మంచినీటి పథకాల నిర్వహణ తీరుపై అప్రమత్తంగా ఉండాలి.
- వ్యక్తిగత మరుగుదొడ్ల వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించాలి.
- గ్రామాల్లో కొబ్బరిబొండాల వ్యాపారులు, హోటళ్ల నిర్వాహకులు మిగిలిన చెత్తను గ్రామ పరిసరాల్లో పోయకుండా తగు చర్యలు తీసుకోవాలి.
- ఇంటి ఆవరణలో ఉన్నటువంటి పాత టైర్లు, కూలర్లు, రోళ్లలో నీటి నిల్వలు లేకుండా చూడాలి.
- సీజనల్ వ్యాధుల బారిన పడకుండా వైద్య, ఆరోగ్య సిబ్బంది సూచనలను పాటించాలి.
- ప్రతీరోజు వేడి ఆహార పదార్థాలనే తీసుకోవాలి.
- సాధ్యమైనంతవరకు కాచి చల్లార్చిన నీటినే తాగాలి. వర్షాకాలంలో వీలైనంతవరకు మాంసాహారానికి దూరంగా ఉండాలి. వంట పాత్రలపై ఎల్లప్పుడు మూతలు ఉండేలా చూసుకోవాలి.
- జ్వరం, దగ్గు, తలనొప్పి, వంటినొప్పులు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి.

అప్రమత్తంగా ఉండాలి..



ఈ సీజన్లలో వచ్చే వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులకు దూరంగా ఉండొచ్చు. అంటువ్యాధులు రాకుండా జాగ్రత్తగా ఉండాలి. దోమల ద్వారా లార్వా పెరగకుండా మలాథీయాన్ స్ప్రే చేయించాలి. ఇళ్లల్లో దోమలు కుట్టకుండా దోమల తెరలు వాడాలి. గదులను గాలి, వెలుతురు ఉండే విధంగా ఉంచుకోవాలి. కాచి చల్లార్చిన నీటినే తాగాలి. వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలి.

– డాక్టర్ తోళ్ల వెంకటేశ్వర్లు, మండల వైద్యాధికారి, చింతకాని

సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయుల ర్యాలీ



ఎర్రుపాలెం: ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ఎర్రుపాలెం/చింతకాని/తల్లాడ: సమస్యలు పరిష్కరించాలని యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఎర్రుపాలెంలోని రింగ్‌సెంటర్ నుంచి తహసీల్ వర కు, చింతకాని ఉన్నత పాఠశాల నుంచి కొదుమూరు వరకు బుధవారం ర్యాలీ నిర్వహించారు. అదే విదంగా తల్లాడ మండలంలో ప్రధాన సెంటర్లో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీపీఎస్ విధానం రద్దు చేయాలని, నూతన విద్యావిధానం అమలు చేయాలని, ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేయాలని, కేజీబీవీ, రెసిడెన్షియల్ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఐక్య కార్యాచరణ కమిటీ బండారు నాగరాజు, అనుమోలు కోటేశ్వరరావు, నీలం అజయ్‌కుమార్, హనుమంతరావు, ముత్తయ్య, భావ్‌సన్, కంచర్ల శ్రీనివాసరావు, పద్మ, జగదీష్, ఉమామహేశ్వరి, పీవీ రమణమ్మ, కృపావతి, సత్యవతి, నాగేశ్వరరావు, సీతారామలక్ష్మి, సత్యనారాయణ, పాండురాజు, వెంకటేశ్వరరావు, సైదారావు, సుబ్బరామరాజు, శేఖర్, భాస్కర్, వీరన్న, కృష్ణప్రసాద్, పుష్పవతి, మహేంద్ర, రవి శంకర్, చింతకాని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాన్సీరాణి, యూఎస్‌పీసీ నాయకులు శ్రీనివాసరావు, మల్లికార్జునరావు, పుల్లయ్య, మధుకర్‌రెడ్డి, జలీల్ పాషా, కుమారస్వామి, కృష్ణప్రసాద్, మనోరమ, ఖాదర్‌బాబు, వెంకటేశ్వర్లు, రజియా, ఫాతిమా, తల్లాడలో టీఎస్ యూటిఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీకాంత్, యూఎస్‌పీఎస్‌సీ నాయకులు శ్రీహరి, రమేష్, కమల, శ్రీనివాసరెడ్డి, లాలు, కమలాకర్‌రెడ్డి, వెంకట్, మైసయ్య బలరామిరెడ్డి తదితరులు ఉన్నారు.

ఎన్నికల నిర్వహణపై సమావేశం



సమావేశంలో పాల్గొన్న రాజకీయ పార్టీల నాయకులు

పెనుబల్లి: ఓటు హక్కు వినియోగం, నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో తహసీల్‌లో తహసీల్దార్ ఎం.రమాదేవి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలో ఎన్నికల నిర్వహణ సజావుగా జరిగేందుకు రాజకీయ పార్టీ నాయకుల సలహాలు, సూచనలు కోరారు. కొత్తగా పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడం, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు వినియోగంపై, ఓటర్లకు ఈవీఎంల నిర్వహణపై అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 20 నుంచి మొబైల్ సదస్సులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మోహన్‌రావు, పలు పార్టీల నాయకులు ముక్కెర భూపాల్‌రెడ్డి, బుక్కా కృష్ణవేణి, బొర్రా నరసింహారావు, చలమాల విఠల్‌రావు, గాయం తిరుపతిరావు, తడికమళ్ళ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఓటు నమోదు చేయించుకోవాలి



ముదిగొండ: మాట్లాడుతున్న తహసీల్దార్ శిరీష

ముదిగొండ/ఏన్కూరు: 18ఏళ్లు నిండిన యువతీ, యువకులను ఓటరుగా నమోదు చేయించాలని ముదిగొండ, ఏన్కూరు మండలాల తహసీల్దార్లు శిరీష, ముజాహిద్‌లు తెలిపారు. ముదిగొండ మండలంలో, ఏన్కూరులోని స్థానిక రైతు వేదికలో బుధవారం బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు సేకరించాలని అన్నారు. వివిధ అంశాలపై బీఎల్‌ఓలకు అవగాహన కల్పించారు. సమావేశంలో నాయబ్ తహసీల్దార్ దామోదర్, గిర్దావర్ వహిదా, ఎంపీడీఓ బయ్యారపు అశోక్, ఎస్సై బాదావత్ రవి, డిప్యూటీ రవీందర్, ఆర్‌ఐలు రాజశేఖర్, రమేష్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

నులి పురుగులను నివారించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ షేక్ షిలార్‌సాహెబ్

మధిర/సత్తుపల్లిటౌన్: నులి పురుగులను నివారించాలని మాటూరుపేట, గాంగారం పీహెచ్‌సీల వైద్యులు వెంకటేష్, అవినాష్, ఎంపీడీఓ షేక్.షిలార్ సాహెబ్ తెలిపారు. నులి పురుగుల నివారణ దినోత్సవంపై బుధవారం సత్తుపల్లి మండలంలో, మధిరలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్, కళాశాలలో విద్యార్థులకు డాక్టర్లు అవగాహన కల్పించారు. అదే విధంగా ఎంపీడీఓ ఆధ్వర్యంలో మండల టాస్క్‌ఫోర్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేడు నిర్వహించనున్న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని, దీని నివారణకు 1 నుంచి 19 సంవత్సరాల పిల్లలందరికీ నులి పురుగుల నివారణ మాత్రలను మింగించాలని తెలిపారు. ఈ కార్యక్రమాలల్లో మండల విద్యాశాఖాధికారి ప్రభాకర్, మండల పంచాయతీ అధికారి శాస్త్రి, ఐకేపీ ఏపీఎం రెడ్డి, ఆరోగ్య పర్యవేక్షణ అధికారులు గోవింద్, శరత్‌బాబు, భాస్కరరావు, మోక్షారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ప్రిన్సిపాల్ షేక్ షమీమ్, క్రాంతికుమార్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

బీటెక్ ఫలితాల్లో 'మిస్ట్' విద్యార్థుల ప్రతిభ



నాగసులోచన



కొండా సంధ్య

సత్తుపల్లిరూరల్: బీటెక్ నాలుగో సంవత్సరం రెండో సెమిస్టర్ ఫలితాల్లో సత్తుపల్లిలోని మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈమేరకు కళాశాలలో 91.59 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, సివిల్ విభాగంలో బోడా నాగసులోచన 9.25, బి.అఖిల 9.06 ఎస్‌జీపీఏతో మొదటి రెండు స్థానాల్లో నిలిచారని ప్రిన్సిపాల్ సీహెచ్.హరికృష్ణ తెలిపారు. అలాగే, ఈఈఈ బ్రాంచ్‌లో కొండా సంధ్య, కొండా పవన్‌కుమార్ 9.06 ఎస్‌జీపీఏ, దారా సునంద 8.87, మెకానికల్ విభాగంలో కార్తీక్ 9.25, దుర్గ సత్యసాయి కిరణ్, భూక్యా శ్రీధర్ 8.5 ఎస్‌జీపీఏ సాధించగా, ప్రిన్సిపాల్‌తో పాటు కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, చైర్మన్ కంచర్ల సత్యనారాయణ, అధ్యాపకులు అభినందించారు.

ప్రైవేట్ వ్యక్తులను అడ్డుకున్న జీపీ కార్మికులు



ఏన్కూరు: ఇరువర్గాలతో మాట్లాడుతున్న పోలీసులు

కల్లూరు: కల్లూరు మేజర్ గ్రామ పంచాయతీలో బుధవారం పారిశుద్ధ్య పనులు నిర్వహించేందుకు ప్రైవేట్ వ్యక్తులను ఈఓ సీహెచ్ కృష్ణారావు ఏర్పాటు చేశారు. దీంతో పంచాయతీ కార్మికులు వారిని అడ్డుకున్నారు. మేము గత 14రోజులుగా సమస్యల పరిష్కారానికై సమ్మె చేస్తుంటే మీరు వేరేవారిని ఎలా నియమిస్తారని ధర్నాకు దిగారు. దీంతో ప్రవేట్ కార్మికులు వెనుదిరిగారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఊడల కృష్ణ, సయ్యద్ వజీర్‌మియా, కొత్తపల్లి సుధాకర్, ప్రవీణ్, గోపికృష్ణ, లక్ష్మి, యశోధ పాల్గొన్నారు.

ఇందిరానగర్ కాలనీలో..

ఏన్కూరు: మండలంలోని ఇందిరానగర్ కాలనీలో పారిశుద్ధ్యం పెరగడంతో జీపీ అధికారులు కొందరు ప్రవేట్ వారిని పెట్టి పారిశుద్ధ్య నిర్వహన చేయిస్తున్నారు. విషయం తెలుసుకున్న సమ్మె చేస్తున్న కార్మికులు ప్రైవేట్‌వారిని అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాలకు తోపులాట జరిగడంతో పోలీసులు ఇరువర్గాలకు నచ్చచెప్పారు. ఈ కార్యక్రమంలో జీపీ కార్మికులు ఇల్లూరి బిక్షమయ్య, గోపయ్య, ముత్యాలరావు, రాములు, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

14వ రోజుకు చేరిన జీపీ వర్కర్ల సమ్మె

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారం 14వ రోజుకు చేరుకుంది. ఈ సమ్మెకు పలు రాజకీయ పార్టీలు, పలు ప్రైవేట్ సంఘాల ఆధ్వర్యాన నాయకులు సంఘీభావం ప్రకటించారు. పలుచోట్ల కార్మికులు వంటా వార్పు, బిక్షాటన నిర్వహించారు. అదే విధంగా కొన్ని చోట్ల రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించి పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్‌లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి సమ్మెను విరమింపచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. – సాక్షి నెట్‌వర్క్



తల్లాడ: గ్రామ పంచాయతీ వర్కర్ల వంటా వార్పు



చింతకాని: భిక్షాటన చేస్తున్న జీపీ కార్మికులు

రుణమాఫీ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం

సత్తుపల్లిరూరల్: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రైతుల రుణాలను మాఫీ చేయకుండా రాష్ట్రప్రభుత్వం మోసం చేస్తోందని సత్తుపల్లి సొసైటీ ఉపాధ్యక్షుడు గాదె చెన్నారావు విమర్శించారు. సత్తుపల్లిలో బుధవారం ఆయన మాట్లాడుతూ 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పుడు సీఎం వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో రూ.2లక్షల వరకు రైతుల రుణాలను మాఫీ చేశారని తెలిపారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం రుణాలు మాఫీ చేయకపోగా, ప్రజలకు ఇచ్చిన ఏ హామీని నెరవేర్చలేదని ఆరోపించారు. కాగా, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచి అధికారంలోకి రాగానే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, స్థలం ఉన్న పేదలకు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు, రూ.500లకే గ్యాస్‌బండ తదితర పథకాలు అమలుచేస్తామని తెలిపారు.

అంబేడ్కర్ ఆడిటోరియం నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లత

మధిర: మధిర మున్సిపాలిటీ పరిధిలోని ఇల్లందులపాడు వద్ద రూ.2.60 కోట్లతో నిర్మించనున్న అంబేడ్కర్ ఆడిటోరియం నిర్మాణానికి మున్సిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మధిర మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమాదేవి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ శీలం విద్యాలత, ఏఈ నరేష్‌రెడ్డి, మధిర సొసైటీ చైర్మన్ బిక్కి ప్రసాద్, నాయకులు రంగిశెట్టి కోటేశ్వరరావు, వాసిరెడ్డి నాగేశ్వరరావు, హరిగ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జనసేన మండల వీర మహిళా అధ్యక్షురాలిగా శ్రీదేవి



శ్రీదేవి

ఎర్రుపాలెం: మండలకేంద్రంలో బుధవారం జనసేన పార్టీ మండల స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ వీర మహిళ మండల కమిటీ అధ్యక్షురాలిగా యర్రంశెట్టి శ్రీదేవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు మిర్యాల నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా ఎర్రుపాలెం టౌన్ కమిటీ పార్టీ అధ్యక్షుడిగా శ్రీపాలశెట్టి శివశంకర్, ప్రధాన కార్యదర్శిగా పసుపులేటి రఘురామ్, ఉపాధ్యక్షుడిగా యర్రంశెట్టి సాయివినయ్‌లను ఎన్నిక చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నవీన్, కార్యదర్శి ఏడుకొండలు తదితరులు ఉన్నారు.

ఉత్తమ జోన్ చైర్మన్‌గా లగడపాటి



అవార్డు స్వీకరిస్తున్న వైరా లయన్స్‌క్లబ్ జోన్ చైర్మన్ ప్రభాకర్

వైరా: లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ 320ఈ రీజియన్‌లో 2022–23 ఆర్థిక సంవత్సరంలో అత్యున్నత సేవలందించినందుకుగాను వైరా లయన్స్‌క్లబ్ జోన్ చైర్మన్ లగడపాటి ప్రభాకర్‌రావు ఉత్తమ జోన్ చైర్మన్‌గా ఎంపికయ్యారు. ఈ మేరకు బుధవారం నల్లగొండలో జరిగిన అవార్డుల ఉత్సవంలో జిల్లా గవర్నర్ తీగల మోహన్‌రావు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ప్రభాకర్‌రావుకు అవార్డు రావడం పట్ల వీడీజీ 2 నంబూరి మధుసూధనరావు, అంబాసిడర్ డాక్టర్ కాపా మురళీ కృష్ణ, జీఎంటీ కోఆర్డినేటర్ డాక్టర్ ఉండ్రు శ్యాంబాబు, మైక్రో క్యాబినెట్ సభ్యులు విశ్వేశ్వరరావు, కృష్ణమూర్తి, సునీత తదితరులు అభినందించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

చింతకాని: మండలంలోని జగన్నాధపురం గ్రామానికి చెందిన కోపూరి రాంబాబుకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతున్న రాంబాబుకు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క సిఫారసుతో మంజూరైన రూ.60 వేల చెక్కు మంజూరైందన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగార్జున్, నాయకులు వెంకటేశ్వర్లు, రమేష్, కిషన్‌రావు, కోటయ్య పాల్గొన్నారు.

సీఈఐఆర్ సేవలను వినియోగించుకోవాలి

చింతకాని: పోగుట్టుకున్న సెల్‌ఫోన్‌ను గుర్తించేందుకు భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీఈఐఆర్ ప్రవేశపెట్టింది. ఈ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఎస్సై పాదిల వెంకన్న అన్నారు. మండలంలోని నాగులవంచ గ్రామానికి చెందిన తిరుమలాపురం ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంబటి శాంతయ్య ఇటీవల తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు సీఐఈఆర్ ద్వారా ఫోన్‌ను రికవరీ చేసి అందించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

పొంగులేటిపై కక్షసాధింపు చర్యలు మానుకోవాలి

కారేపల్లి: పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు కక్షసాధింపు చర్యలు మానుకోవాలని టీపీసీసీ సభ్యుడు మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. బుధవారం కారేపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకులు నోటిని అదుపులో పెట్టుకుని మాట్లాడాలన్నారు. రేవంత్‌రెడ్డి విద్యుత్ సంస్థలో అవినీతిని బయటపెట్టడంతో.. ఆయన వ్యాఖ్యలను వక్రీకరించి ప్రజలను తప్పుదోవపట్టించడం సిగ్గుచేటన్నారు. ఇదంతా రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్ పార్టీకి తగిన బుద్ధి ప్రజలే చెబుతారన్నారు. ఎవరెన్ని చెప్పినా 24 గంటల కరెంట్ అంటే గుర్తొచ్చేది కాంగ్రెస్ పార్టీయేనన్నారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డవారికే అధిష్టానం టికెట్ ఇస్తుందని, వైరా నుంచి కాంగ్రెస్ అభ్యర్థి తానేనని, అధిష్టానం తనకే టికెట్ ఇస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సురేందర్ మనియార్, పాటి నర్సయ్య, సట్టి వీరభద్రం, మేదరి టోనీవీరప్రతాప్, సొసైటీ డైరెక్టర్ హీరాలాల్, తాజుద్దీన్, రాంబాబు, భీముడు, వినోద్, అప్పారావు, కల్యాణ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

పట్టణంలోని కల్పతరురోడ్డు సాయి రాఘవ టవర్స్ వెనుక వీధిలోని విద్యుత్‌స్తంభం మధ్యలో విరిగిపోయి ప్రమాదకరంగా మారింది. స్థానికులు ఈ విద్యుత్ స్తంభానికి కర్రను సపోర్టుగా కట్టారు. అయితే వర్షాకాలం సీజన్ కావటంతో గాలిదుమారానికి ఎప్పుడు విరిగిపోతుందోనని భయాందోళనకు గురౌతున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

– సత్తుపల్లిటౌన్



ప్రశ్నించాల్సిన అధికారి :
– శరత్‌బాబు, ఏఈ, విద్యుత్‌శాఖ
సెల్ నంబర్ :9440814133